సాక్షి కృష్ణాజిల్లా

మంగళవారం ၊ 19 ၊ డిసెంబర్ ၊ 2023



ప్రకృతి వ్యవసాయంపై వర్క్‌షాప్


మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏపీ వ్యవసాయశాఖ సహకారంతో సోమవారం విజయవాడలోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో ప్రకృతి వ్యవసాయంపై వర్క్‌షాప్ జరిగింది.



యార్డుకు 57,979 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 57,979 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి 54,482 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

లయోల ప్లాటినం జూబ్లీ వేడుకలు



గుణదల (విజయవాడ తూర్పు): ఆంధ్ర లయోల కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు కళాశాల ఆవరణలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కథోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావును సత్కరించారు.

న్యూస్‌రీల్

ఈడుపుగల్లు స్విమ్మర్ల ప్రతిభ



కంకిపాడు: సౌత్‌జోన్ అంతర్‌జిల్లాల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో ఈడుపుగల్లు స్విమ్మర్లు సత్తా చాటారు. గ్రామానికి చెందిన బిళ్లా హర్షిత, బిళ్లా హర్షశ్రీ ఈ నెల 16, 17 తేదీల్లో పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన సౌత్ జోన్ అంతర్‌జిల్లాల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో రాణించారు. బెంగళూరులో జరగనున్న సౌత్‌జోన్ నేషనల్స్‌కు అర్హత సాధించారు. హర్షిత నాలుగు బంగారు పతకాలు, రజత పతకం సాధించారు. హర్షశ్రీ రజతం, రెండు కాంస్య పతకాలు పొందారు. క్రీడాకారులను డీఎస్‌డీఓ ఝాన్సీలక్ష్మి సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

కలంకారి అచ్చులతో రాధాకృష్ణుల చిత్రపటం



పెడన: కలంకారి అచ్చులతో రాధాకృష్ణుల బొమ్మను ముద్రించడం ఇదే ప్రప్రథమని శ్యామల ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ కలంకారి వస్త్ర ఉత్పత్తిదారుడు పిచ్చుక శ్రీనివాసరావు అన్నారు. ద్వారకాతిరుమలలో ఈ నెల 16న శ్రీవేంకటేశ్వరస్వామికి మొదటి ముద్రణను ఫ్రేం కట్టించి అందజేసినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలంకారి వస్త్రంపై పురాణాలు తెలిసేలా రాధాకృష్ణుల బొమ్మ వేయాలని భావించి అచ్చులు తయారు చేయాలని జాతీయ అవార్డు గ్రహీతలు కొండ్రా సోదరులు గంగాధర్, నరసయ్యను సంప్రదించామని తెలిపారు. వారు రెండు నెలలు శ్రమించి అచ్చులు ఇవ్వడంతో రాధాకృష్ణులు బొమ్మలను ముద్రించామని వివరించారు. దీన్ని ద్వారకాతిరుమలలోని స్వామి సన్నిధిలో ఆవిష్కరించి మొదటి ముద్రణ వేంకటేశ్వరస్వామికి అందజేశామన్నారు. ద్వారకాతిరుమల ప్రధాన అర్చకుడు రాంబాబుకు అందించామని తెలిపారు.

రైల్వే డివిజన్‌లో ఇంధన పొదుపు చర్యలు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): పనిచేసే కార్యాలయాలు, ఇళ్లలో ఇంధన పొదుపు పద్ధతులను సమర్థంగా పాటించాలని విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ ఉద్యోగులకు సూచించారు. ఈ నెల 14 నుంచి 21 వరకు డివిజన్ వ్యాప్తంగా ఇంధన పరిరక్షణ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగా సోమవారం డివిజనల్ కార్యాలయ ప్రాంగణంలో ఉద్యోగులతో ఇంధన పొదుపుపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ అన్ని రంగాల్లో శక్తి వినియోగం తగ్గించడం ద్వారా మరింత స్థిరమైన భవిష్యత్తు సాధ్యమవుతుందన్నారు. విజయవాడ రైల్వే వర్కుషాపునకు నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు-2023 సాధించడం డివిజన్‌లో చేపడుతున్న ఇంధన పొదుపు చర్యలకు అద్దం పడుతోందన్నారు. అందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీకాంత్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు సోమవారం రూ.లక్ష విరాళం అందజేశారు. విజయవాడ పాయకాపురానికి చెందిన డీవీఎస్ పోతరాజు విరాళం మొత్తాన్ని దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కేఎస్ రామారావులకు అందజేశారు. దాతకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతకు ఆలయ కమిటీ చైర్మన్, ఈవో, అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

భవితకు డిజిటల్ విద్య

విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. దీనిలో భాగంగా దివ్యాంగుల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ విద్యను చేరువ చేసింది.
ఈ ప్రక్రియలో జిల్లాలోని భవిత కేంద్రాల్లో దివ్యాంగుల విద్యకు అవసరమైన ట్యాబ్‌లను అందజేసింది. దీనిలో ప్రత్యేక యాప్‌లు పొందుపరిచి వాటితో విద్యాబోధన చేస్తున్నారు. దివ్యాంగ విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులకు, ఐఈఆర్పీలకు కూడా ప్రభుత్వం ట్యాబ్‌లు అందజేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఆధునిక సాధనాలు వినియోగించుకుంటున్న దివ్యాంగులు బంగరు భవిత దిశగా అడుగులు వేస్తున్నారు.

- జిల్లాలో ప్రత్యేక అవసరాలున్న 40 మంది విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ
- ప్రత్యేక యాప్‌లతో భవిత కేంద్రాల్లో డిజిటల్ విద్య
- దివ్యాంగుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి



భవిత కేంద్రాల్లోని విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న జేసీ అపరాజితాసింగ్ (ఫైల్)

పెడన: జిల్లాలోని భవిత కేంద్రాల్లో విద్యార్థులకు డిజిటల్ విద్య వారి ముంగిటకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న విద్యాసంస్కరణల ఫలితంగా సాంకేతిక విద్య దివ్యాంగులకు చేరువైంది. డిజిటల్ చదువుల కోసం ఇప్పటికే 8వ తరగతి విద్యార్థులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ట్యాబ్‌లను రెండు విడతలుగా అందించారు. తాజాగా భవిత కేంద్రాల్లో (ప్రత్యేకావసరాల పిల్లల వనరుల కేంద్రం) విద్యను అభ్యసించే దివ్యాంగులకు అత్యాధునిక ట్యాబ్‌ల్లో ప్రత్యేక యాప్‌లను అప్‌లోడ్ చేయించి ఇచ్చారు. దృష్టి, వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు సాంకేతికంగా అభివృద్ధి చేసిన యాప్‌లతో కూడిన ట్యాబ్‌లను అందించి ఎలా వినియోగించాలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు కూడా శిక్షణ ఇచ్చారు. ఒక్కొక్క ట్యాబ్ విలువ సుమారు రూ.30 వేలు ఉంది.

జిల్లాలో 25 భవిత కేంద్రాలు

కృష్ణా జిల్లాలో 25 భవిత కేంద్రాలు నడుస్తున్నాయి. ఇక్కడ 3 నుంచి 10వ తరగతి వరకు క్లాసులు జరుగుతాయి. మొత్తం 302 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో దృష్టి లోపం ఉన్న 14 మందికి, వినికిడి(చెవిటి, మూగ)లోపం ఉన్న 26 మంది విద్యార్థులకు మొత్తం 40 మందికి ట్యాబ్‌లను అందజేశారు. వీరు కాకుండా భవిత కేంద్రాల్లోనే 8వ తరగతి చదువుతున్న సుమారు 25 మంది విద్యార్థులు గత ఏడాది ట్యాబ్‌లను పొందారు. అలాగే జిల్లాలో వివిధ పాఠశాలల్లో 2,247 మంది దివ్యాంగ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

22 మంది స్కూలు అసిస్టెంట్లు.. 47 మంది ఐఈఆర్పీలకూ ట్యాబ్‌లు

భవిత కేంద్రాల్లోని విద్యార్థులకు పాఠశాల స్థాయిలో పాఠాలను బోధించే స్కూలు అసిస్టెంటు ప్రత్యేక ఉపాధ్యాయులు 22 మందికి కూడా ట్యాబ్‌లను అందజేశారు. వీరు కాకుండా భవిత కేంద్రాల్లో విద్యాబుద్ధులు నేర్పించే ఐఆర్పీలు(ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్) 47 మందికి ట్యాబ్‌లను అందించారు. వీరంతా ఇప్పటికే ట్యాబ్‌లపై శిక్షణ పొందారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ట్యాబ్‌లను ఎలా వినియోగించాలో, పాఠాలను అర్థం చేసుకునే అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.

ప్రత్యేక యాప్‌లతో..

దృష్టి, వినికిడి లోపాలు కలిగిన విద్యార్థులకు సాంకేతికంగా అభివృద్ధి చేసిన యాప్‌లతో కూడిన ట్యాబ్‌లను అందించారు. అంధులు, పాక్షిక అంధులు, బధిరులు, పాక్షిక బధిరులకు వీలుగా టాక్‌బ్యాక్(ట్యాబ్‌ను ఏ వైపు ఉపయోగించినా స్పందించే యాప్), స్పోకెన్ అసిస్టెంట్(శబ్ద సాంకేతికల ద్వారా ట్యాబ్‌ను ఉపయోగించే యాప్), విజిబులిటి ఇన్‌ఎన్స్‌మెంట్(దృష్టి లోపం ఉన్న వారికి, చిన్నచిన్న విషయాలను స్పష్టంగా చూపడానికి యాప్), మిషన్ ఏఐ, 'ఎన్' విజన్ యాప్‌లను (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో పనిచేసే యాప్‌లు) ట్యాబ్‌లలో పొందుపరిచారు. వీటిని ఇతర అవసరాలకు వినియోగించకుండా ప్రత్యేక లాక్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చారు. ప్రత్యేకావసరాలు ఉన్న బాలబాలికలపై ప్రభుత్వం శ్రద్ధ చూపిస్తోంది.

ప్రభుత్వ మేలు మరువలేం

మాది ఐదుగుళ్లపల్లి. ఆశా వర్కర్‌గా పని చేస్తున్నా. మా వారు వ్యవసాయ కూలి. మా అమ్మాయి ప్రియదర్శిని. మల్లవోలు జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతోంది. ట్యాబ్ ఎలా వినియోగించాలనే దానిపై మా పాపకే కాకుండా నాకు కూడా శిక్షణ ఇచ్చారు. ట్యాబ్‌లో పాఠాలు చెబుతుంటే పాప శ్రద్ధ తీసుకుంటోంది. తల్లిదండ్రులకు కూడా శిక్షణ , ఇంటి వద్ద మాపాపకు శిక్షణ ఇవ్వడం వంటివి ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వ మేలు మరువలేనిది.

–కె.రాణి విద్యార్థిని తల్లి, ఐదుగుళ్ల పల్లి, గూడూరు మండలం



దివ్యాంగుల విద్యాభివృద్ధికి ప్రాధాన్యం



భవిత కేంద్రాల్లో విద్యార్థులకు సమారు రూ.30 వేలకు పైగా విలువైన ట్యాబ్‌లను అందజేశాం. విద్యార్థులకు అర్థమయ్యేలా యాప్‌లను పొందుపరిచారు. ఇటీవల టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, ఎమ్మార్ కిట్లను 312 మంది విద్యార్థులకు అందజేశాం. ఇటీవల భవిత కేంద్రాల్లో సిబ్బందిని కూడా నియమించాం. ప్రతి కేంద్రంలోను 20 మంది కంటే ఎక్కువగా విద్యార్థులుండేలా సిబ్బంది చూసుకోవాలి. కేంద్రానికి రాలేని మంచంపై ఉన్న విద్యార్థులకు ఇళ్లకు వెళ్లి హోం బేస్ ఎడ్యుకేషన్ చెప్పేలా చర్యలు తీసుకున్నాం.

–కె.రాములునాయక్, ఏపీసీ, సమగ్ర శిక్ష, మచిలీపట్నం, కృష్ణా

స్పందన అర్జీలకు అత్యంత ప్రాధాన్యం

- కలెక్టర్ రాజాబాబు
- 113 అర్జీలు స్వీకరణ



ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్ రాజాబాబు, ఇతర అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): స్పందనలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యమిచ్చి వాటిని పరిష్కరించాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అపరాజితాసింగ్, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీవో వాణి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వ్యయప్రయాసలతో సమస్యల పరిష్కారానికి వస్తున్నారని వారు అందజేస్తున్న అర్జీలపై సానుకూలంగా స్పందించాలని చెప్పారు. స్పందనలో అధికారులు 113 అర్జీలను స్వీకరించారు.

కొన్ని అర్జీలు ఇవి

- విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామానికి చెందిన తాటి వీరయ్య తనకు గన్నవరం మండలం వెదురుపావులూరు గ్రామంలో సర్వే నంబర్ 213/6లో ఎకరం భూమి ఉందని, దాన్ని రోడ్డు విస్తరణలో భాగంగా మొదటిసారి భూసేకరణ చేసి నష్టపరిహారం అందించారు. మళ్లీ రెండోసారి భూమిని సేకరించారే కానీ నష్టపరిహారం ఇంతవరకు ఇవ్వలేదు. నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు.
- బాపులపాడు మండలం గంటకుంట్ల గ్రామానికి చెందిన హైమావతి అద్దె ఇంట్లో ఉంటున్నానని ఇల్లు కట్టుకోవడానికి స్థలం దరఖాస్తు చేసుకున్నాను. స్థలం మంజూరైనా స్థలం చూపలేదని.. ఇంటి స్థలం ఇప్పించాలని కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు.

ఆరోగ్యశ్రీతో మరింత మెరుగైన వైద్యం



హెల్త్‌కార్డులు అందజేస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా తదితరులు

- కృష్ణాలో 5.95 లక్షల మందికి ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులు
- సీఎం వైఎస్ జగన్ కార్యక్రమాన్ని వర్చువల్‌గా వీక్షించిన కలెక్టర్, ఎస్పీ
- లబ్ధిదారులకు కార్డులు అందజేత

చిలకలపూడి(మచిలీపట్నం): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డు ద్వారా ఉచిత వైద్యం, మంచి సదుపాయాలు లబ్ధిదారులకు అందనున్నాయని కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వైఎస్సార్ హెల్త్ కార్డులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించే కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో ఎస్పీ జాషువాతో కలిసి వీక్షించారు. జిల్లాలోని లబ్ధిదారులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గతంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులకు రూ. 5 నుంచి రూ. 10 లక్షల వరకు పరిమితి ఉండేదన్నారు. పేదలకు మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలనే ఉద్దేశంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి నేడు రూ. 5 లక్షల వరకు వైద్యసాయం అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. జిల్లాలో 70 ఆసుపత్రుల ద్వారా ఆరోగ్యశ్రీ వైద్యసేవలు ప్రజలు పొందుతున్నారని చెప్పారు. ఇప్పటి వరకు 2,01,133 చికిత్సలు చేశారన్నారు. వీటి కోసం 2019 నుంచి 2023 డిసెంబరు వరకు రూ. 447.27 కోట్లు వెచ్చించారని తెలిపారు. జనవరి 1 నుంచి జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండోదశ కార్యక్రమం ప్రారంభించనున్నామన్నారు. గ్రామీణ, పట్టణ, అర్బన్ ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలకు ఏదైనా అనారోగ్యం ఉంటే శిబిరాల్లో పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ జాషువా, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గీతాబాయి, జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, డీసీహెచ్‌ఎస్ శ్రావణ్‌కుమార్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

మనోధైర్యం కలిగిస్తోంది



డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డు ద్వారా వైద్య సాయం పొందడంలో ఎంతో మనో ధైర్యాన్ని కలిగిస్తుంది. భర్త మోటారు ఫీల్డ్‌లో పని చేస్తుంటారని ఏదైనా ప్రమాదం జరిగితే డబ్బులు వెచ్చించడానికి ఆలోచించాల్సిన పరిస్థితి ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్ద మనసుతో ఆరోగ్యశ్రీ కార్డును అందించడం సంతోషం కలిగించింది.

–సిలగోరు శశి, ముస్తాఖాన్‌పేట, మచిలీపట్నం

మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు



పేద, మధ్య తరగతి కుటుంబీకులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఎంతో మేలు జరుగుతుంది. ఏదైనా అనారోగ్యం పాలైతే ఆసుపత్రిలో లక్షలాది రూపాయలు చెల్లించలేక చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అందించే ఈ కార్డు ద్వారా మాలాంటి వారికి ఎంతో ధైర్యాన్ని ఇస్తుంది.

– పాశ పుష్ప, సర్కిల్‌పేట, మచిలీపట్నం

ఓం శరవణభవ..



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణంలో దేవదాయశాఖ మంత్రి సత్యనారాయణ, ఎమ్మెల్యే రమేష్‌బాబు

- మోపిదేవిలో షష్ఠి మహోత్సవం
- అంగరంగ వైభవంగా స్వామివారి కల్యాణం
- స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి సత్యనారాయణ

మోపిదేవి: రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మోపిదేవిలో సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు కనుల పండువగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో సోమవారం ఉదయం జరిగిన కల్యాణ మహోత్సవంలో ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు.. స్వామి వార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో వేదపండితులు కొమ్మూరి ఫణికుమార్ శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు బుద్దు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో ఉదయం 6 గంటలకు ప్రాతఃకాలార్చనలు, గోపూజ, నిత్య హోమం, బలిహరణ నిర్వహించారు. ఉదయం 11 గంటలకు కల్యాణోత్సవం జరిగింది. సాయంత్రం 6 గంటలకు రావివారి పాలెం వరకు మయూర వాహనంపై శ్రీ స్వామి వార్ల గ్రామోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నందిగం మేరీరాణి, మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయ పుష్కరిణి ప్రారంభం

మోపిదేవి: శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థాన పుష్కరిణిని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుతో కలసి సోమవారం ప్రారంభించారు. పుష్కరిణి ఆవరణలోనే సుమారు 1.50 కోట్లతో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్, విశ్రాంతి రూములకు శంకుస్థాపన చేశారు. తొలుత గ్రామానికి రెండువైపులా ఏర్పాటు చేసిన స్వాగత ద్వారాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఏసీ చక్రధరరావు మాట్లాడుతూ సుమారు రూ. 4 కోట్లతో పుష్కరిణి అభివృద్ధితో పాటు అన్న ప్రసాదం హాలు, విశ్రాంతిశాల, క్యూలైన్ల ఏర్పాటు, డ్రైనేజీ పనులు చేపట్టినట్లు వివరించారు. మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ పుష్కరిణి అభివృద్ధికి సీజేఎస్ ఫండ్స్ నుంచి రూ. కోటి మంజూరు చేశామని, దేవస్థానం నుంచి రూ. 50 లక్షలు కలిపి అభివృద్ధి చేసినట్లు చెప్పారు. అవసరమైతే మరిన్ని నిధులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికరాము, సర్పంచ్ నందిగం మేరీరాణి, పార్టీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, కాకినాడ జోన్ దేవదాయశాఖ డెప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు, అసిస్టెంట్ కమిషనర్ శాంతి తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యనారాయణ, ఎమ్మెల్యే రమేష్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ హారిక

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.4.24 కోట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు హుండీల ద్వారా రూ.4.24 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడులుగా సమర్పించారు. ఆది దంపతులకు భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను సోమవారం మహా మండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 27 రోజులకు గాను రూ.4,24,12,325 నగదుతో పాటు 670 గ్రాముల బంగారం, 8.150 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ ఈవో కె.ఎస్. రామారావు పేర్కొన్నారు. హుండీల ద్వారా సరాసరిన రోజుకు రూ.15.70 లక్షల ఆదాయం దేవస్థానానికి వచ్చిందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఇక విదేశీ భక్తుల నుంచి భారీగానే డాలర్లు హుండీ ద్వారా లభ్యమయ్యాయని తెలిపారు. యూఎస్ఏ డాలర్లు –865, యూఏఈకి చెందిన 445 దిర్హమ్స్, ఖత్తర్‌కు చెందిన 102 రియాల్స్‌తో పాటు ఇతర దేశాలకు చెందిన కరెన్సీ లభ్యమైనట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. హుండీ కానుకల లెక్కింపును ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కె.ఎస్.రామారావుతో పాటు పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు. ఆలయ సిబ్బంది, సేవా సిబ్బంది లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.



హుండీ కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు

దీక్ష విరమణలకు సన్నద్ధం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరిగే అతి పెద్ద ఉత్సవాల్లో రెండోదైన భవానీ దీక్ష విరమణలు జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందుకు ఇంద్రకీలాద్రి సిద్ధమవుతోంది. ఐదు రోజుల పాటు సాగే కార్యక్రమానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి సుమారు 4.5 లక్షల మంది భవానీలు విచ్చేస్తారని ఆలయ అధికారులతో పాటు జిల్లా అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది. దీక్ష విరమణలలో కీలకమైన నాల్గో రోజు జనవరి ఆరో తేదీ ఉదయం నుంచి 7వ తేదీ తెల్లవారుజాము వరకు నిర్వహించే గిరి ప్రదక్షిణలో భవానీలతో పాటు నగర వాసులు పాల్గొననున్న నేపథ్యంలో మరింత కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

4.5 నుంచి 5 లక్షల మంది వస్తారని అంచనా

ఈ ఏడాది భవానీ దీక్ష విరమణలకు సుమారు 4.5 లక్షల నుంచి 5 లక్షల మంది విచ్చేసే అవకాశం ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అంచనా వేశారు. ఉత్సవాలలో తొలి మూడు రోజులలో రోజుకు 50 వేల పైబడి భవానీలు ఇరుముడులను సమర్పించే అవకాశం ఉందని అంచనా వేశారు. ఆలయ ప్రాంగణంతో పాటు కనకదుర్గ నగర్ ప్రసాదాల కౌంటర్, స్నానఘాట్లు, ఇరుముడులను సమర్పించే కౌంటర్లు, హోమగుండాల ఏర్పాట్లపై దేవస్థాన అధికారులతో చర్చించారు.

సాఫ్ట్ టెన్నిస్ రాష్ట్ర విజేత అనూష

విజయవాడస్పోర్ట్స్: సాఫ్ట్ టెన్నిస్ సీనియర్ స్త్రీ, పురుషుల అంతర జిల్లాల పోటీల్లో విజయవాడ క్రీడాకారిణి అనూష సత్తా చాటింది. ఈ నెల 16, 17 తేదీల్లో గుంటూరు బీఆర్ స్టేడియంలో జరిగిన పోటీలకు అనూష ఉమ్మడి కృష్ణాజిల్లాకు ప్రాతినిధ్యం వహించింది. ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌లో వేదాపై 2–0, క్వార్టర్ ఫైనల్స్‌లో మానసపై 2–1, సెమీస్‌లో వైశాలిపై 2–1, ఫైనల్స్‌లో భావనపై 3–1 తేడాతో అనూష గెలిచి విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. పోటీల అనంతరం జరిగిన రాష్ట్ర జట్టు ఎంపిక పోటీల్లోనూ అనూష అద్భుతమైన క్రీడా నైపుణ్యం ప్రదర్శించి జట్టులో చోటు దక్కించుకుంది. జనవరి 13 నుంచి మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనుంది.

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- జోరందుకున్న ధాన్యం సేకరణ
- ఇప్పటివరకు 4,190 టన్నుల తరలింపు
- రూ 9 కోట్లు రైతులకు చెల్లింపు



పెనమలూరు: వరి సాగుచేసిన రైతులకు ప్రభుత్వం అండగా నిలిచింది. రైతులు పండించిన వరిని మిల్లులకు సకాలంలో తరలిస్తున్నారు. మండలంలో దాదాపు ఆరు వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. వీరి కోసం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. రైతుల వద్ద ధాన్యాన్ని ప్రభుత్వం గిట్టుబాటు ధరలకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తోంది. ఇటీవల తుపాను రావటంతో ధాన్యం సేకరణ కొద్ది రోజులు నిలుపు చేశారు. మళ్లీ ధాన్యం సేకరణను మొదలుపెట్టారు. మండల పరిధిలో ఇప్పటి వరకు 4,190 టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.9 కోట్ల సొమ్మును రైతులకు వెంటనే ప్రభుత్వం చెల్లించిందని ఏవో శైలజ తెలిపారు. ఇంకా దాదాపు 9 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు.

క్లుప్తంగా

23న తిరుపతమ్మ అమ్మవారి ఉత్తర ద్వార దర్శనం

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈ నెల 23వ తేదీన గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారు భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిస్తారని ఆలయ ఈఓ కె. రమేష్‌నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు సాయంత్రం 6.17 గంటల నుంచి గ్రామోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. 22వ తేదీ రాత్రి 7.01 గంటల నుంచి ఆలయం వద్ద అమ్మవారికి పూజ, భజన, జాగరణ జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీన హుండీ కానుకల లెక్కింపు జరుగుతుందని ఈఓ మరో ప్రకటనలో తెలిపారు.

సత్తాచాటిన గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ



గుడ్లవల్లేరు(గుడివాడ): అంతర్ కళాశాలల అథ్లెటిక్ చాంపియన్‌షిప్ ట్రోఫీని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ క్రీడాకారులు కైవసం చేసుకుని విజయ కేతనం ఎగురవేశారు. ఈ విషయాన్ని సోమవారం ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణ కుమార్ విలేకరులకు తెలిపారు. ఈ నెల 16, 17వ తేదీల్లో జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో అంతర కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు జరిగాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో తమ కళాశాల జట్టు సత్తా చాటిందని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులతో పాటు వ్యాయామ అధ్యాపకులు ఎం.శివశంకర్, డి.పూజితను కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి సత్యనారాయణ, సహ కార్యదర్శి రామకృష్ణ, సలహాదారు డాక్టర్ పి.రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపాల్ కోదండ రామారావు, పలువురు అధ్యాపకులు అభినందించారు.

కనుల పండువగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



కల్యాణ వేడుకను జరిపిస్తున్న ఆలయ అర్చకులు



జంటనాగులకు క్షీరాభిషేకం చేస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. తొలుత స్వామి ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. గణపతి పూజ అనంతరం ఉత్సవమూర్తులకు కల్యాణాన్ని జరిపించగా, ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు. కల్యాణోత్సవంలో పాలక మండలి చైర్మన్ కర్నాటి రాంబాబు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపించారు. పెద్ద ఎత్తున ఉభయదాతలు, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. షష్ఠిని పురస్కరించుకుని పుట్టలో పాలు పోసేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయ ప్రాంగణంలో బారులు తీరారు.

సుబ్రహ్మణ్య స్వామికి కమిషనర్ పూజలు

దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సోమవారం ఇంద్రకీలాద్రిపై శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంద్రకీలాద్రికి విచ్చేసిన ఆయనకు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ కె.ఎస్.రామారావు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, చైర్మన్, ఈఓ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారిని కమిషనర్ సత్యనారాయణ దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని జంట నాగులకు కమిషనర్ క్షీరాభిషేకం చేశారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడాలి

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఇతర అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లా ప్రజలు విద్యుత్‌ను ఎంతో పొదుపుగా వాడాలని కలెక్టర్ పి.రాజాబాబు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో సోమవారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఆయన పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో విద్యుత్ పొదుపుతో ఇంధనం ఆదా చేయవచ్చని సూచించారు. సంప్రదాయ బల్బుల స్థానంలో ఎల్‌ఈడీ బల్బులను వాడితే 60 శాతానికి పైగా విద్యుత్‌ను ఆదా చేయొచ్చని పేర్కొన్నారు. మూడు లేదా అంతకంటే ఎక్కువ స్టార్లు కలిగిన గృహోపకరణాలను వినియోగంతో 30 శాతం విద్యుత్ వినియోగాన్ని ఆదా చేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్, ఆర్డీఓఎం.వాణి, ఏపీసీపీడీసీఎల్ ఈఈ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా ఎన్టీఆర్ జిల్లా



ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా చాంపియన్‌షిప్ అందుకుంటున్న స్విమ్మర్లు

విజయవాడ స్పోర్ట్స్: సౌత్ జోన్ తొమ్మిదో అంతర జిల్లాల స్విమ్మింగ్ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారులు అద్భుత క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఎస్‌ఎస్‌ఎన్ కాలేజీలో రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా నుంచి 68 మంది ప్రాతినిధ్యం వహించారు. గ్రూప్–1 బాలుర విభాగంలో ఎస్.జగదీష్, బాలికల విభాగంలో ఎన్.పావని సరయు, గ్రూప్–2 బాలికల విభాగంలో సి.హెచ్.భానుశ్రీ, గ్రూప్–3 బాలుర విభాగంలో ఎం.రామ్ మణికంఠతో పాటు మరికొంత మంది క్రీడాకారులు 27 బంగారు, 27 రజత, 15 కాంస్య పతకాలతోపాటు 231 అత్యధిక పాయింట్లు సాధించి మెరుగైన క్రీడా నైపుణ్యంతో వ్యక్తిగత ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను జిల్లాకు అందించారు. క్రీడా మైదానంలో జరిగిన పోటీల ముగింపు కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ఎన్టీఆర్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఐ.రమేష్ సమక్షంలో చాంపియన్‌షిప్‌ను అందుకున్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా, జేసీ అపరాజిత సింగ్, ఏఎస్పీ శ్రీహరి

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో పకడ్బందీగా సాధారణ ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి భద్రతా ప్రణాళిక, కమ్యూనికేషన్ ప్లాన్, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు, పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం, రిసెప్షన్ కేంద్రం, స్ట్రాంగ్‌రూమ్స్, చెక్‌పోస్టుల ఏర్పాటు, శాంతి భద్రతలు తదితర అంశాలపై తీసుకోనున్న చర్యలను కలెక్టర్ వివరించారు. ఈ నెల 22, 23 తేదీల్లో విజయవాడలో కలెక్టర్లు, ఎస్పీలతో కేంద్ర, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులు నిర్వహించే సమీక్ష సమావేశానికి నివేదికలు సిద్ధం చేసుకున్నట్లు ఎన్నికల అధికారికి కలెక్టర్ సూచించారు. జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్, ఏఎస్పీ శ్రీహరిబాబు, డీఆర్వో పెద్ది రోజా, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతు అనుమానాస్పద మృతి

బంటుమిల్లి(పెడన): మండలంలోని పెందుర్రు గ్రామానికి చెందిన ఆక్వా రైతు గాజుల రామకృష్ణ (50) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రామకృష్ణకు చేపల చెరువులు ఉన్నాయి. అతని పెద్ద కుమారుడు సతీష్‌తో కుటుంబ వివాదాలు ఏర్పడ్డాయి. ఈ వివాదాల నేపథ్యంలో పెద్దకుమారుడిపై రామకృష్ణ పోలీసులకు గతంలో ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదుపై నమోదైన కేసులో తండ్రీకుమారులు రాజీపడి లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకున్నారు. ఆ తరువాత కూడా వారిద్దరి మధ్య గొడవలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం ఇంటి వద్ద భోజనం చేసి చెరువు వద్దకు వెళ్లిన రామకృష్ణ తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతని కోసం గాలించగా చేపల చెరువులో రామకృష్ణ మృతదేహం కనిపించింది. తన భర్త మరణానికి పెద్ద కుమారుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ రామకృష్ణ భార్య రంగామణి ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి ఎస్‌ఐ ఎ.పైడిబాబు దర్యాప్తు చేపట్టారు.

నవవధువు ఆత్మహత్య

కోనేరుసెంటర్(మచిలీపట్నం): అనుమానాస్పద స్థితిలో నవవధువు ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై మచిలీపట్నం పోలీస్ స్టేషన్లో సోమవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. గిలకలదిండికి చెందిన పీతా దేవికకు మొగల్తూరుకు చెందిన చిలకలపూడి నాగేశ్వరరావుతో ఈ నెల ఏడో తేదీన పెద్దల సమక్షంలో వివాహమైంది. తొమ్మిదో తేదీన భర్తతో కలిసి దేవిక పుట్టింటికి వచ్చింది. 12వ తేదీన ఆమెకు వాంతులు కావడంతో తల్లిదండ్రులు స్థానిక ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఉన్నట్టుండి వాంతులు కావడంపై అనుమానంతో కుటుంబ సభ్యులు నిలదీయటంతో ఆత్మహత్య చేసుకునేందుకు ఎలుకల మందు తాగానని దేవిక చెప్పింది. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహా మేరకు విజయవాడ ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం విషమించడంతో ఈ నెల 17న మృతి చెందింది. దేవిక తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మచిలీపట్నం పోలీసులు కేసు నమోదుశారు.

తండ్రి హత్య కేసులో కొడుకు అరెస్ట్



నాగాయలంక(అవనిగడ్డ): మండలంలోని భావదేవరపల్లి గ్రామానికి చెందిన బండే హరిమోహనరావు(48) హత్య కేసులో అతని కుమారుడు పవన్‌కల్యాణ్(20)ను అరెస్ట్ చేసినట్లు అవనిగడ్డ సీఐ ఎల్.రమేష్, ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. వారి కథనం మేరకు.. వ్యసనాలకు బానిసగా మారిన పవన్ కల్యాణ్ తెలిసిన వారందరి వద్ద అప్పులు చేస్తూ వాటిని తీర్చడానికి తండ్రి మోహనరావు ఉంటున్న ఇంటి స్థలాన్ని విక్రయించాల్సిందిగా తరచూ ఇబ్బందులు పెడుతున్నాడు. అయితే ఇందుకు తండ్రి అంగీకరించ లేదు. దీనిని మనసులో పెట్టుకుని ఈ నెల 15వ తేదీ రాత్రి 7.30 గంటల సమయంలో పవన్‌కల్యాణ్ తండ్రి ఉంటున్న ఇంటికి వచ్చి అతనితో గొడవపడ్డాడు. బలమైన ఆయుధంతో తండ్రి తలపై కొట్టి తీవ్రంగా గాయపర్చి, ఆతర్వాత డీజిల్ పోసి నిప్పు అంటించి పారిపోయాడు. ఆదివారం మధ్యాహ్నం అవనిగడ్డ బస్‌స్టేషన్ నుంచి నిందితుడు పవన్‌కల్యాణ్ పారిపోవడానికి ప్రయత్నిస్తున్నాడన్న సమాచారం తెలుసుకున్న సీఐ, సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. నేరం చేయడానికి ఉపయోగించిన ఆయుధం సుత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు నిందితుడు పవన్‌కల్యాణ్‌ను సోమవారం అవనిగడ్డ కోర్టులో హాజరుపర్చారు.

బిహార్ దొంగలను పట్టుకున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న నగలు, నిందితులతో డీఎస్పీ శ్రీకాంత్, సీఐ శుభాకర్, ఎస్‌ఐ సందీప్

కూచిపూడి(మొవ్వ): బంగారానికి మెరుగు పెడతామంటూ వచ్చి మహిళను మోసగించిన కేసును కూచిపూడి పోలీసులు ఛేదించారు. బిహార్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. కూచిపూడి పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శ్రీకాంత్, పామర్రు సీఐ వి.శుభాకర్, ఎస్‌ఐ డి.సందీప్ సోమవారం విలేకరులకు ఈ కేసు వివరాలను వెల్లడించారు. వారి కథనం మేరకు.. మార్చి 28వ తేదీన బంగారానికి మెరుగు పెడతామంటూ ఇద్దరు వ్యక్తులు మొవ్వ మండలం పెదపూడి పంచాయతీ శివారు యద్దనపూడిలోని ఓ ఇంటికి వెళ్లి నగలు చోరీ చేశారు. ఈ కేసును ప్రతిష్టాత్మంగా తీసుకున్న ఎస్పీ పి.జాషువా ఆదేశాల మేరకు గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ పర్యవేక్షణలో కూచిపూడి పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి తొమ్మిది నెలలపాటు దర్యాప్తు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. బిహార్ రాష్ట్రం భగల్పూర్ జిల్లా నౌగచియా, మీర్జాహట్ మండలాలకు చెందిన దీపక్ కుమార్(38), జగన్నాథ్(33)ను నిందితులుగా గుర్తించారు. మొవ్వ మండలం కూచిపూడి–బార్లపూడి రోడ్డులోని పెట్రోల్ బంకు వద్ద ఇద్దరు నిందితులను సోమవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.15 లక్షల విలువైన 263 గ్రాముల బంగారం, మోటారు సైకిల్, నాలుగు సెల్ ఫోన్లు, నగలను మెరుగుపెట్టే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు యద్దనపూడితో పాటు పామర్రు, గన్నవరం, విజయవాడ టూటౌన్, ఇబ్రహీంపట్నం, కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరం ప్రాంతాల్లో నేరాలకు పాల్పడ్డారని, అమలాపురం, రామచంద్రపురం, హైదరాబాదుల్లో పలు కేసులు ఉన్నాయని పోలీసుల దర్యాప్తులో తేలింది.

నేరం చేసేది ఇలా..

నిందితులు ఇద్దరు విజయవాడలోని ఓ లాడ్జిలో ఉంటూ నేరాలకు పాల్పడతారు. స్థానికంగా బైక్ కొనుగోలు చేసి దానిపై తిరుగుతూ రెక్కీ నిర్వహిస్తారు. ఊరి చివర ఒంటరిగా ఉంటున్న వారిని లక్ష్యంగా చేసుకుని బంగారం మెరుగు పెడతామని నమ్మించి మోసగిస్తారు. ఓ పాత్రలో నీరు పోసి స్టౌపై పెట్టించి తమతో పాటు తెచ్చుకున్న షైనింగ్ పౌడర్ వేసి మరిగిస్తారు. ఆ తరువాత బంగారు నగలను మరుగుతున్న నీటిలో వేయిస్తారు. ఆ తరువాత ఏదో ఒక వస్తువు కావాలంటూ ఇంటిలోని వారి దృష్టి మళ్లించి అక్కడి నుంచి పక్కకు పంపించి, నగలు దోచుకుని బైక్ పై పారిపోతారు.

రివార్డులు ప్రకటించిన జిల్లా ఎస్పీ

అంతర్రాష్ట్ర దొంగలను పట్టుకున్న పామర్రు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.శుభాకర్, కూచిపూడి ఎస్‌ఐ డి.సందీప్, సీసీఎస్ ఏఎస్‌ఐ (మచిలీపట్నం) జె.శ్రీనివాసరావు, కూచిపూడి కానిస్టేబుళ్లు కె.ఎస్.శివాజీ, బి.గోపిరాజు, ఎస్.నరసింహారావు, షేక్ బాజీ, పి.శేషు కుమార్‌కు ఎస్పీ పి.జాషువా రివార్డులు ప్రకటించారు. ఈ పోత్సాహక రివార్డులను డీఎస్పీ శ్రీకాంత్ చేతుల మీదుగా అందజేశారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు వివాహితల ఆత్మహత్య



అన్నపూర్ణ మృతదేహం



ఆదిలక్ష్మి మృతదేహం



విమల మృతదేహం

పెనమలూరు: వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మహిళలు ఆత్మహత్య చేసుకున్నారు. భర్త మందలించాడని ఒకరు, భర్తతో గొడవపడి మరొకరు, వేధింపులతో ఇంకొకరు బలవన్మరణం చెందారు. ఈ ఘటనలపై పోలీసులు సోమవారం కేసులు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టి.వి.వి.రామారావు కథనం మేరకు.. గవిడి నాగరాజు, అన్నపూర్ణ(36) దంపతులు వణుకూరు వీఈఎంసీ లేఅవుటు–3లో 1297 నంబర్ ఇంట్లో గతంలో నివసించేవారు. వారి కుమార్తె పదో తరగతి చదువుతున్న నేపథ్యంలో ఇటీవల విజయవాడ పటమటకు వచ్చి నివసిస్తున్నారు. అన్నపూర్ణ తరచుగా ఫోన్ మాట్లాడటాన్ని భర్త గుర్తించాడు. ఫోన్‌లో తరుచూ మాట్లాడొద్దని చెప్పినా ఆమె తీరులో మార్పు రాలేదు. ఈ నెల 16వ తేదీన అన్నపూర్ణకు నాగరాజు ఫోన్ చేయగా ఎంగేజ్ వచ్చింది. రాత్రి ఇంటికి వచ్చిన అతను భార్యను మందలించాడు. 17వ తేదీ మధ్యాహ్నం తలనొప్పి మాత్రల కోసమని అన్నపూర్ణ ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో అనుమానం వచ్చి వణుకూరులో తమ ఇంటి పక్కన ఉండే నాగమణికి భర్త నాగరాజు ఫోన్ చేసి అన్నపూర్ణ వచ్చిందా అని అడిగాడు. ఇంటి బయట చెప్పులు ఉన్నాయని నాగమణి తెలుపటంతో నాగరాజు వణుకూరు వెళ్లి చూడగా అన్నపూర్ణ ఇంట్లో ఉరేసుకోని మృతి చెంది కనిపించింది. నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భర్తతో గొడవపడి మహిళ ఆత్మహత్య

విజయనగరం జిల్లా బొండపల్లి గ్రామానికి చెందిన ఎస్.పైడితల్లి, ఆదిలక్ష్మి (55) దంపతులు 30 సంవత్సరాల క్రితం చోడవరం గ్రామానికి వచ్చి నివసిస్తున్నారు. వారు కూలీ పనులుచేస్తూ జీవిస్తున్నారు. పైడితల్లి ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం ఇంటికి రాగా ఆదిలక్ష్మి పక్కింట్లో ఉంది. ఆమెను పిలిచి భోజనం వడ్డించాలని పైడితల్లి అడిగాడు. దీంతో వారిద్దరి మధ్య గొడవ జరిగింది. ఆదిలక్ష్మి మనస్తాపం చెందిన కలుపు మందు తాగింది. ఆమెను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతి చెందింది. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత బలవన్మరణం

గుడ్లవల్లేరు(గుడివాడ): మండలంలోని వడ్లమన్నాడుకు చెందిన వివాహిత పెన్నేరు అన్నపూర్ణ వెంకట విమల(42) ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి బంధువుల కథనం మేరకు.. విజయవాడకు చెందిన విమలకు వడ్లమన్నాడుకు చెందిన పెన్నేరు వెంకట రామ్మోహనరావుతో 24 ఏళ్ల క్రితం వివాహమైంది. రామ్మోహనరావు చేపల చెరువులు సాగుచేసి అప్పుల పాలయ్యాడు. ఆ అప్పులు తీర్చేందుకు పుట్టింటి నుంచి సొమ్ము తీసుకురావాలని భార్యను వేధించేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో విమల ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తమ కుమార్తె ఆత్మహత్యకు భర్త తీరే కారణమని మృతురాలి తల్లి వెన్నా వెంకట నాగరాజకుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు రామ్మోహనరావుతో పాటు అతని తల్లిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ జి.సత్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం కార్యవర్గం ఎంపిక



సీతారామరాజుకు ఎన్నిక పత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, సంఘ నాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం కృష్ణా జిల్లా కార్యవర్గాన్ని సోమవారం ఎంపిక చేశారు. స్థానిక టీచర్స్ గిల్డ్ హోమ్ సమీపంలోని సంఘ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు నేతృత్వంలో ఈ ఎంపిక జరిగింది. సంఘ జిల్లా అధ్యక్షుడిగా రావులపాటి సీతారామరాజును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అతడికి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు ఎంపికపత్రాన్ని అందజేశారు. సంఘ నాయకులు కె.చిరంజీవి, మాజీ అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, పరింకాయల సుబ్రహ్మణ్యేశ్వర రావు, డి.ఎస్.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.